# క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

### : రామగుండం సి.ఐ. ప్రవీణ్

### కరాటే టోర్నీల్లో విక్టరీ షోటోకాన్ విద్యార్థుల సత్తా

### రెండు గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌లతో రామగుండం పేరు



**అగ్ని ధార న్యూస్ (రామగుండం):** క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి జీవితంలో విజయ మార్గాన్ని చూపుతాయని రామగుండం సి.ఐ. ప్రవీణ్ అన్నారు. కష్టపడి సాధన చేస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించే అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ఇటీవల కాకినాడలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే టోర్నీతో పాటు బెల్లంపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో రామగుండం విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌లు సాధించడం గర్వకారణమని తెలిపారు.ఈ సందర్భంగా ఆదివారం రామగుండం అకాడమీలో నిర్వహించిన సక్సెస్ మీట్‌కు సి.ఐ. ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలు ఆధునిక సమాజంలో ఎంతో అవసరమని, ముఖ్యంగా బాలికలు తప్పనిసరిగా ఆత్మరక్షణలో శిక్షణ పొందాలని సూచించారు.జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రామగుండం పేరు ప్రతిష్టలు పెంచిన సుద్దమల్ల హర్షవర్ధన్, మల్లెపల్లి మంజునాథ్తో పాటు ఇతర విద్యార్థులను సి.ఐ. ప్రత్యేకంగా అభినందించారు. గెలుపును స్ఫూర్తిగా తీసుకుని, ఓటమికి కుంగిపోకుండా ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై రాణించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు.

**విజేతల వివరాలు:**

మాస్టర్లు బోయపోతు రాము, ఒడ్డేపల్లి సురేష్, నవీన్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు పతకాల పంట పండించారు.

**గ్రాండ్ ఛాంపియన్‌షిప్:** సుద్దమల్ల హర్షవర్ధన్ స్పారింగ్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు.

**పతక విజేతలు:** శ్రీనిధి, అక్షిత్ రామ్, గౌతమ్, శ్రీకరణ్, అర్చన, అద్వైత్, అవినాష్, మంజునాథ్, ఆశ్రిత సాయి తదితరులు వివిధ విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించారు.ఈ కార్యక్రమంలో అంతర్గం ఎస్.ఐ. వెంకట్, మాజీ కౌన్సిలర్ ఇస్సంపల్లి అంజులు, సుబోధ్ స్మార్ట్ కిడ్ కరెస్పాండెంట్ ఠాకూర్ బల్వాన్ సింగ్, కాంగ్రెస్ నాయకులు సుదగోని సతీష్‌తో పాటు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో రామగుండం ఉత్తమ ర్యాంక్ లక్ష్యం

### సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి: కమిషనర్ జె. అరుణ శ్రీ

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో రామగుండం నగరం ఉత్తమ ర్యాంక్ సాధించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. బుధవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నివాస ప్రాంతాల్లో రోజుకు కనీసం ఒకసారి, వ్యాపార ప్రాంతాల్లో రోజుకు రెండుసార్లు ఊడ్చి శుభ్రం చేయాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వేయడానికి రెండు బిన్లు ఏర్పాటు చేయాలని, వాణిజ్య ప్రాంతాల్లో ప్రమాదకార చెత్త కోసం మూడవ బిన్ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ వారీగా సానిటేషన్ ప్లాన్, రూట్ మ్యాప్‌తో పాటు నగర స్థాయి సిటీ సానిటేషన్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నిర్దేశించిన మొత్తం 12,500 మార్కుల్లో 10,500 మార్కులు సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కే కేటాయించబడినందున, సేవల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఇంటి వద్దనే తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంతో పాటు సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువీర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీ.వి. రామన్, డీఈలు శాంతి స్వరూప్, షాభాజ్, ఏఈలు జమీల్, మీర్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం, సంపత్, వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్లు, జవాన్లు పాల్గొన్నారు.

## పూలే సాహు అంబేద్కర్ మహా జాతరను జయప్రదం చేయాలి

### భూపాలపల్లి జిల్లా ప్రజలకు కోల శ్యామ్ పిలుపు



**అగ్నిధార న్యూస్ ,(భూపాలపల్లి):** ఈ నెల 24, 25 తేదీల్లో మహారాష్ట్ర రాష్ట్రం గడ్చిరోలి జిల్లా సిరోంచలో నిర్వహించనున్న పూలే సాహు అంబేద్కర్ మహా జాతరను ఘనంగా జయప్రదం చేయాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కోల శ్యామ్ పిలుపునిచ్చారు. "సాంస్కృతిక పరివర్తన దినం"ను పురస్కరించుకొని నలంద చారిటబుల్ ట్రస్ట్ మరియు మిలింద్ వికాస్ మండల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మహా జాతర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సామాజిక సమానత్వం, మానవ గౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన జ్యోతిరావు పూలే, రాజర్షి షాహూ మహారాజ్, డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి ఏడాది సిరోంచ చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి సుమారు 20 వేల మందికి పైగా ప్రజలు ఈ జాతరలో పాల్గొంటారని తెలిపారు. భూపాలపల్లి జిల్లా ప్రజలు అంబేద్కరిస్టులు, బుద్ధిస్టులు, బీసీ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ మహా జాతరను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

### -జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల :** జిల్లా ప్రజలకుజిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే క్రిస్మస్ పండుగ క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన పండుగని కలెక్టర్ పేర్కొన్నారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ప్రేమను పంచుకోవడం, సేవాభావంతో మానవత్వాన్ని కాపాడుకోవడం ఎలా అన్న విషయాలను క్రీస్తు బోధనలు తెలియచేస్తాయని తెలిపారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ కు ఘన సన్మానం...!



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, సుంకరి మహేష్, ఉప సర్పంచ్, బసినేని వినోద వార్డు సభ్యులు నీలం శ్రీనివాస్, గోసిక విజయ్, సుందిళ్ల శారద, దేగ సందీప్, గోశిక రాజనర్సు, సుందిల్ల కనకతార, గుమ్మడి మల్లయ్య,ను గౌడ సంఘం అధ్యక్షుడు గురుదేవుని శ్రీనివాస్ మరియు వారి సంగం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధియే నా దేయంగా పనిచేస్తానని అన్నారు. ఆయన చెప్పిన వాగ్దానాలన్నీ తప్పకుండా నెరవేరుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మరియు బి ఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ చరిత్ర తరతరాలకు చేరాలి

### రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

### సమ్మక్క సారక్క 2' భక్తి గీతాల ఆల్బమ్‌ను ఆవిష్కరించిన మంత్రి



**అగ్నిధారన్యూస్ ,(మేడారంములుగు):** గిరిజనుల ఆత్మగౌరవం, పోరాట చరిత్రను పాటల రూపంలో తరతరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మేడారం సమ్మక్క సారక్క సన్నిధిలో నేతకాని ముద్దుబిడ్డ పొట్టల నాగరాజు రచించిన 'సమ్మక్క సారక్క 2' భక్తి గీతాల ఆల్బమ్‌ను ఆమె సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, వందల ఏళ్ల క్రితమే సామంత దోపిడీకి ఎదురొడ్డి పోరాడిన వీర వనితలు సమ్మక్క సారక్కల త్యాగ గాథను నేటి తరానికి గుర్తుచేయడంలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గిరిజనుల చరిత్ర, సంస్కృతి, జీవన విధానాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆమె స్పష్టం చేశారు. పొట్టల నాగరాజు రచించిన ఈ ఆల్బమ్‌లోని "జారు జారు బండల్లో జంపన్న వాగులో", "కోయదేవార కొండదేవారా" అనే పాటలు గిరిజన ప్రజల జీవన పోరాటాన్ని, ప్రకృతితో వారి అనుబంధాన్ని హృద్యంగా ప్రతిబింబిస్తున్నాయని మంత్రి కొనియాడారు. గిరిజన చైతన్యాన్ని పెంపొందించే సాహిత్య సాంస్కృతిక కృషి మరింత విస్తరించాలని రచయిత నాగరాజును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈపీ ఇంజనీర్, ట్రైబల్ వెల్ఫేర్ రిటైర్డ్ అధికారి (హైదరాబాద్) ముడిమగుల శంకర్, నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యేసుకురి రాజమల్లు, మాజీ అధ్యక్షులు దుర్గం గోపాల్, ములుగు జిల్లా అధ్యక్షులు జాడి రాంబాబు, గాయకుడు దూట రాజసమ్మయ్య, పొట్టాల చందు, దుర్గం సమ్మయ్య (వరంగల్), సల్లూరి ఎల్లయ్య (ఏటూర్ నాగారం) తదితరులు పాల్గొన్నారు. గిరిజనుల పోరాట వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చే ఇలాంటి కార్యక్రమాలకు ప్రజాసంఘాలు, సాంస్కృతిక కార్యకర్తలు మరింత మద్దతు ఇవ్వాలని వక్తలు పిలుపునిచ్చారు.

## కొత్త టెండర్ లో పాత కార్మికులను కొనసాగించాలి



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ డిసెంబర్: 24** కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ భాష బోయిన రవికుమార్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా సివిల్ ఏజీఎం సివిల్ టెండర్ విషయమై వినతి పత్రం ఇవ్వడం జరిగింది గత 20 సంవత్సరాల నుంచి జిఎం ఆఫీస్ వర్క్ షాప్ వీకే సెవెన్ పీవీకే జీకే ఓ సి కలుపుకొని సివిల్ టెండర్ పిలవడం జరిగేది కానీ కొత్తగా జిఎం ఆఫీస్ వర్క్ షాప్ కట్టడం వలన పాత జిఎం ఆఫీస్ వర్క్ షాప్ క్యాన్సిల్ అయిందని తక్కువ మంది తోటి రెండు నెలల కిందట టెండర్ పిలవడం వలన 8 మంది స్కావెంజర్స్ స్లీపర్లు కలుపుకొని రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిన తరుణంలో సివిల్ ఎ జీఎం కలిసినప్పుడు ఫూల్ మాస్టర్ ల కింద కొత్త జిఎం ఆఫీస్ వర్క్ షాప్ పనిచేసే విధంగా ఆ కార్మికులకి చెప్పడం జరిగింది కొత్త టెండర్ వచ్చినప్పుడు ఈ ఎనిమిది మంది కార్మికులను కూడా ఆ కొత్త టెండర్లు తీసుకుంటామని చెప్పినప్పటి కి ఇప్పటికి రెండు నెలలు గడుస్తున్న టెండర్ ఓపెన్ కాలేదని ఈ రోజున సంఘం ఆధ్వర్యంలో ఏ జీఎం వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఏ జీఎం సానుకూలంగా స్పందించి ప్రాసెస్ నడుస్తుంది నోటు కూడా తయారయింది పది పదిహేను రోజులలో టెండర్ ఓపెన్ చేసి ఆ పాత కార్మికులని మల్ల తిరిగి విధుల్లోకి తీసుకుంటామని కూడా హామీ ఇవ్వడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో( వి కే సీ ఎమ్)ఆఫ్ లోడింగ్ ఇంచార్జ్ రామచందర్ పాల్గొన్నారు.

## బోరు ప్రారంభించిన ఖానాపూర్ సర్పంచ్

### – గ్రామ అభివృద్ధిలో తొలి అడుగు



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని మండలం ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 6వ వార్డులో సర్పంచ్ సంగం అరుణ గట్టయ్య, ఉపసర్పంచ్ గుంజ సత్యనారాయణ బోరు బావిని బుధవారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు నీటి సౌకర్యం మరింత మెరుగుపడేలా హనుమాన్ ఆలయం సమీపంలో దుద్దిల్ల శ్రీధర్ బాబు, దుద్దిల్ల శ్రీను బాబు సహకారంతో బోరు వేయించడం జరిగింది.బోరును ప్రారంభించడం ద్వారా స్థానిక ప్రజలకు అవసరమైన తాగునీటి సదుపాయం కలగనుంది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉపసర్పంచ్ లతోపాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని బోరు ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి దిశగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.గ్రామ ప్రజల మౌలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ బోరు పనులు విజయవంతంగా పూర్తవ్వడం ఆనందకరమని, భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధికి ఇలాంటి మరిన్ని పనులు చేపట్టాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గ్రామపంచాయతీ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

## కరెంట్ షాక్ తో పాడి గేదె మృతి



**అగ్నిధార న్యూస్ మంథని :** పాడి గేదె మృతి చెందిన సంఘటన బుధవారం మంథని పట్టణం లో చోటు చేసుకుంది. మంథని పట్టణానికి చెందిన రైతు మూలపురుషోత్తం రెడ్డి పాడి గేదె మేత మెస్తూ ఉండగా మంథని గోదావరి వద్ద విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది.గేదె విలువ 70 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం నుండి నష్ట పరిహారం ఇప్పించాలని విద్యుత్ అధికారులను బాధితుడు కోరారు.

## ముళ్ల పొదలు తొలగించిన మున్సిపల్ సిబ్బంది



**అగ్నిధార న్యూస్ మంథని :** రైతుల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైన రెడ్డి చెరువు పెద్ద తూము నుంచి మత్తడి వరకు బుధవారం మంథని మున్సిపల్ సిబ్బంది ముళ్ల పొదలు తొలగించారు.దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ గంగాపురి రెడ్డి చెరువు కట్ట మత్తడి నుండి తూము అవతలి వరకు ముళ్ళ పొదలను జెసిబి సహాయం తో తొలగించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్య క్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎరుకల రమేష్ బాబు , గోరంట్ల సుధాకర్ ,పోరండ్ల రంజిత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాల స్వామి, కొండ రవి, రైతులు జంజర్ల సతీష్, మెడిశెట్టి సతీష్ పులి పెద్ద శంకర్, విత్తనాల వెంకటరమణ, నామని శ్రీనివాస్ , కొంతం మల్లయ్య పాల్గొనారు.

## దిక్కుతోచని వృద్ధులకు అండగా జిల్లా యంత్రాంగం

### ఇద్దరు వృద్ధ మహిళలను అమ్మానాన్న ఆశ్రమానికి తరలింపు



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** దిక్కుతోచని స్థితిలో రోడ్డుపై జీవనం సాగిస్తున్న వృద్ధ మహిళలకు పెద్దపల్లి జిల్లా యంత్రాంగం మానవతా హృదయంతో అండగా నిలిచింది. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలంలోని బి. పవరాజ్ బస్టాండ్ వద్ద ఒక వయోవృద్ధురాలు భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తోందన్న సమాచారం మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అక్కడికి చేరుకున్నారు.ఆ వృద్ధురాలి వివరాలు తెలుసుకోగా, ఇద్దరు కూతుర్లు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో తాను ఈ దుస్థితికి చేరుకున్నట్లు ఆమె వెల్లడించింది. దీనిపై వెంటనే స్పందించిన శిశు సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి స్వర్ణలత ఆమెను హైదరాబాద్ సమీపంలోని చౌటుప్పల్‌లో ఉన్న అమ్మానాన్న ఆశ్రమానికి తరలించారు.అలాగే గత నెల రోజుల క్రితం పెద్దపల్లి మండలం పెద్ద కలువల గ్రామంలో ఇదే పరిస్థితిలో ఉన్న 80 సంవత్సరాల వృద్ధురాలిని గుర్తించిన అధికారులు, ఆమెను ముందుగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం బుధవారం ఇద్దరు వృద్ధ మహిళలను కలిసి హైదరాబాద్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. దిక్కుతోచని వృద్ధులకు భరోసా కల్పిస్తూ జిల్లా యంత్రాంగం చేపట్టిన ఈ చర్యపై స్థానికులు అభినందనలు తెలిపారు. వృద్ధుల సంరక్షణకు ప్రభుత్వ శాఖలు, అధికారులు ఇలాగే ముందుండాలని పలువురు కోరారు.

